శ్రీమద్భగవద్గీత

అథ ప్రథమోఽధ్యాయః - అర్జునవిషాదయోగః

ధృతరాష్ట్ర ఉవాచ

1 ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।

మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ।

ధర్మక్షేత్రే - కురుక్షేత్రే - సమవేతాః - యుయుత్సవః

మామకాః - పాండవాః - చ-ఏవ - కిం - అకుర్వత - సంజయ

సంజయ= ఓ సంజయా, ధర్మక్షేత్రే = ధర్మమైన, కురుక్షేత్రే=కురుక్షేత్రమునకు, యుయుత్సవః= యుద్ధ సన్నద్ధులై, సమవేతాః = కూడినవారైన, మామకాః = నావారును, పాండవాః చ ఏవ = పాండవులును, కిం = ఏమి, అకుర్వత=చేసిరి.

ధృతరాష్ట్రుడు ఇట్లు పలికెను - ఓ సంజయా ! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునకు యుద్ధసన్నద్ధులై చేకూడియున్న నా వారగు దుర్యోధనాదులును పాండు పుత్రులును ఏమి చేసిరి ?

సంజయ ఉవాచ

2 దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।

ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ।

దృష్ట్వా - తు - పాండవానీకం - వ్యూఢం - దుర్యోధనః - తదా

ఆచార్యం - ఉపసంగమ్య - రాజా - వచనం - అబ్రవీత్

తదా= ఆ సమయమున, రాజా=రాజైన, దుర్యోధనః=దుర్యోధనుడు, వ్యూఢం = వ్యూహ్యరచనతో రణమునకు మోహరించియున్న, పాండవానీకం = పాండవ సైన్యమును, దృష్ట్వా = చూచి, తు = మరియు, ఆచార్యమ్ = ద్రోణాచార్యుల వారిని, ఉపసంగమ్య = సమీపించి, వచనం = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

ధృతరాష్ట్రునితో సంజయుడిట్లు పల్కెను - ఆ సమయమున రాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో రణమునకు మోహరించియున్న పాండవసైన్యమును చూచి, ద్రోణాచార్యుని సమీపించి ఇలా పలికెను.

3 పశ్యైతాం పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్ ।

వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ।

పశ్య - ఏతాం - పాండుపుత్రాణాం - ఆచార్య - మహతీం - చమూం.

వ్యూఢాం - ద్రుపదపుత్రేణ - తవ - శిష్యేణ - ధీమతా

ఆచార్య = ఓ ఆచార్యుడా, తవ = నీ యొక్క, ధీమతా = బుద్ధిమంతుడును, శిష్యేణ=శిష్యుడును, ద్రుపద పుత్రేణ = ద్రుపదుని కుమారుడగు ధృష్టద్యుమ్నునిచేత, వ్యూఢాం = వ్యూహాకారముగ నిలుపబడిన, పాండుపుత్రాణాం =పాండుతనయుల యొక్క, ఏతాం = ఈ , మహతీం = గొప్పదియగు, చమూం = సైన్యమును, పశ్య = చూడుము.

ఓ ఆచార్యా ! బుద్ధిమంతుడైన మీ శిష్యుడును, ద్రుపదపుత్రుడును అయిన ధృష్టద్యుమ్నునిచే వ్యూహాకారముగా నిల్పబడిన పాండవుల ఈ గొప్ప సైన్యమును చూడుము.

4 అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।

యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ।

అత్ర-శూరాః-మహేష్వాసాః-భీమార్జునసమాః - యుధి

యుయుధానః - విరాటః - చ - ద్రుపదః - చ - మహారథః.

అత్ర = ఇచ్చట, యుధి = సమరమునందు, భీమార్జునసమాః = భీమార్జునులతో సరితూగు వారును, మహేష్వాసాః = గొప్ప విలుకాండ్రును, శూరాః= శూరులును, యుయుధానః = యుయుధానుడు (సాత్యకి), విరాటః = విరాటుడును, చ = మరియు, మహారథః = మహారథుడైన, ద్రుపదః = ద్రుపదుడును, చ = మరియు,

ఈ పాండవ సేనలందు శూరులను, గొప్ప ధనుర్విద్యా సంపన్నులును, భీమార్జునులతో సమానులును గలరు, మరియు సాత్యకి, విరాటుడు, మహారథి ద్రుపదరాజును.

5 ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్।

పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః।

ధృష్టకేతుః - చేకితానః - కాశిరాజః - చ - వీర్యవాన్

పురుజిత్ - కుంతిభోజః - చ - శైబ్యః - చ - నరపుంగవః

ధృష్టకేతుః = ధృష్టకేతుడు, చేకితానః = చేకితానుడు, వీర్యవాన్ = బలశాలియైన, కాశిరాజః = కాశీరాజును, చ = మరియు, పురుజిత్ = పురుజిత్తుడును, కుంతిభోజః = కుంతిభోజుడును, చ = ఇంకను, నరపుంగవః = శ్రేష్ఠమానవుడైన, శైబ్యః = శైబ్యుడును, చ = మరియు,

మరియు ధృష్టకేతువు, చేకితానుడు, బలశాలి కాశీరాజు, పురుజిత్తు, కుంతి భోజుడు, మానవశ్రేష్ఠుడగు శైబ్యుడును

6 యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్।

సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః।

యుధామన్యుః - చ - విక్రాంతః - ఉత్తమౌజాః - చ - వీర్యవాన్

సౌభద్రః - ద్రౌపదేయాః - చ - సర్వే - ఏవ - మహారథాః ॥

విక్రాంతః = పరాక్రమవంతుడైన, యుధామన్యుః = యుధామన్యుడు, చ = మరియు, వీర్యవాన్ - వీరుడగు, ఉత్తమౌజాః = ఉత్తమౌజుడును, చ = మరియు, సౌభద్రః = సుభద్రా పుత్రుడగు అభిమన్యుడును, చ = మరియు, ద్రౌపదేయాః = ద్రౌపదీపుత్రులును, సర్వే = అందరును, మహారథాః ఏవ = మహారథులే.

పరాక్రమవంతుడైన యుధామన్యుడు, వీరుడైన ఉత్తమౌజుడు, సుభద్రాపుత్రుడైన అభిమన్యుడు, ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులును కలరు. వీరందరును మహారథులే.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

7 అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।

నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ।

అస్మాకం - తు - విశిష్టాః - యే -తాన్ - నిబోధ - ద్విజోత్తమ

నాయకాః - మమ- సైన్యస్య - సంజ్ఞార్థం - తాన్ - బ్రవీమి - తే

ద్విజోత్తమ= ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా, అస్మాకం = మన పక్షములో, తు = కూడా, యే = ఎవరు, విశిష్టాః = శ్రేష్ఠులో, మమ = నా యొక్క, సైన్యస్య = సైన్యమునకు, నాయకాః = నాయకులో, తాన్ = వారిని, తే = నీకు, సంజ్ఞార్థం = తెలియుటకొరకు, బ్రవీమి = తెలుపుచున్నాను, తాన్ = వారిని, నిబోధ = తెలిసికొనుము

ఓ బ్రాహ్మణోత్తమా ! మన సైన్యములో ప్రధాన యోధులను గూడ గమనింపుడు. మీకు తెలియుటకై మన సేనానాయకులను గూర్చియు తెలుపుచున్నాను.

8 భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।

అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ

భవాన్ - భీష్మః - చ - కర్ణః - చ - కృపః - చ - సమితింజయః

అశ్వత్థామా - వికర్ణః - చ - సౌమదత్తిః - తథా - ఏవ -చ

భవాన్ = తమరును, భీష్మః = భీష్ముడును, చ = మరియు, కర్ణః = కర్ణుడును, చ = మరియు, సమితింజయః = సమరవిజయుడునగు, కృపః = కృపాచార్యుడును, చ = మరియు, అశ్వత్థామా = అశ్వత్థామయును, వికర్ణః = వికర్ణుడును, చ = మరియు, సౌమదత్తిః = సోమదత్తుని పుత్రుడు నగు భూరిశ్రవుడును, తథా = అలాగున, ఏవ చ = మరియు తమరును, భీష్ముడు, కర్ణుడు, సమరవిజయుడగు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడైన భూరిశ్రవుడు ఇందు ముఖ్యులు.

9 అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః।

నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః।

అన్యే - చ - బహవః - శూరాః - మదర్థే - త్యక్తజీవితాః

నానాశస్త్రప్రహరణాః - సర్వే - యుద్ధ విశారదాః

అన్యే = ఇతరులును, చ = కూడ, బహవః = అనేకులు, శూరాః = శూరులు, మదర్థే = నా కొరకు, త్యక్త జీవితాః = జీవితములపై భ్రాంతి వదిలినవారై, సర్వే = వీరందరును, నానాశస్త్ర ప్రహరణాః = అనేకములగు శస్త్రాస్త్రములు గలవారును, యుద్ధవిశారదాః = సమర చాతుర్యము గలవారును

ఇంకను పెక్కుమంది శూరులును, వీరులును మన సైన్యమునందు కలరు. వీరందరును యుద్ధవిశారదులు. నానాశస్త్రాస్త్రధారులై. నాకొరకు తమ జీవితములను ధారపోసియైనను యుద్ధము చేయుటకు సిద్ధముగా నున్నారు.

10 అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్।

పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ।

అపర్యాప్తం - తత్ - అస్మాకం - బలం - భీష్మాభిరక్షితం

పర్యాప్తం - తు - ఇదం - ఏతేషాం - బలం - భీమాభిరక్షితం

తత్ = అలాంటి, అస్మాకం = మనయొక్క, భీష్మాభిరక్షితం = భీష్మాచార్యులవారిచే సురక్షిత మైన, బలం = సైన్యం, అపర్యాప్తం = అపారము, తు = అయితే, భీమాభిరక్షితం = భీమునిచే రక్షితమైన, ఏతేషాం = వారియొక్క, ఇదం = ఈ, బలం = సైన్యం, పర్యాప్తం = పరిమితముగ నున్నది.

భీష్మపితామహునిచే సురక్షితమై, అపరిమితముగా నున్న మనసైన్యము అపరిమితమై యున్నది. భీమునిచే రక్షింపబడుచు పాండవసైన్యం పరిమితముగానున్నది.

11 అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః।

భీష్మ మేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ॥

అయనేషు - చ - సర్వేషు - యథాభాగం - అవస్థితాః

భీష్మం - ఏవ - అభిరక్షంతు - భవంతః - సర్వే - ఏవ - హి

భవంతః = మీరు, సర్వే ఏవ = అందరును, చ = అందువల్ల, సర్వేషు = సకలములైన, అయనేషు = వ్యూహస్థానముల యందు, యథాభాగం = మీ మీ నియమిత స్థానముల యందు, అవస్థితాః = ఉండినవారై, భీష్మమేవ = భీష్మాచార్యులవారినే, అభిరక్షంతు హి =చక్కగా రక్షింతురుగాక

కనుక మీరందరును మీమీ స్థానములలో సుస్థిరముగా నిలిచి, అన్నివైపులనుండి నిశ్చయముగా భీష్ముని రక్షించుచుండవలెను.

12 తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః।

సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్।

తస్య - సంజనయన్ - హర్షం - కురువృద్ధః - పితామహః

సింహనాదం - వినద్య - ఉచ్చైః - శంఖం - దధ్మౌ - ప్రతాపవాన్

తస్య = ఆ దుర్యోధనునకు, హర్షం = సంతోషమును, సంజనయన్ = కలిగించుచు, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడును, కురువృద్ధః = కురువృద్ధుడును, పితామహః - పితామహుడును, ఉచ్చైః = బిగ్గరగా, సింహనాదం = సింహనాదమును, వినద్య = చేసి, శంఖం = శంఖమును, దధ్మౌ=పూరించెను.

కురువృద్ధుడును, ప్రతాపశాలియును ఐన భీష్మ పితామహుడు దుర్యోధనుని సంతోషపఱచుటకై ఉచ్చస్వరముతో సింహనాదముచేసి, తన శంఖమును పూరించెను.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

13 తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః।

సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోஉభవత్।

తతః - శంఖాః -చ - భేర్యః - చ - పణవానక గోముఖాః

సహసా - ఏవ - అభ్యహన్యంత - సః - శబ్దః - తుములః - అభవత్

తతః=తరువాత, చ=మరియు, శంఖాః = శంఖములును, చ=మరియు, భేర్యః = భేరులును, పణవానక గోముఖాః = పణవములు, తప్పెటలు, రణభేరులును, సహసా+ ఏవ = ఒకేసారి, అభ్య హన్యంత = మ్రోగించబడెను, సః = ఆ, శబ్దః = ధ్వని, తుములః = గొప్ప భయంకరముగ, అభవత్ = ఆయెను.

ఆతరువాత శంఖములు, నగారాలు, తప్పెటలు, మృదంగములు, గోముఖవాద్యములు మొదలగునవి ఒక్కసారిగా మ్రోగినవి. ఆ ధ్వనులతో దిక్కులను పిక్కటిల్లాయి. (ఆ శబ్దములు భయంకరముగా నుండెను).

14 తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ।

మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః।

తతః - శ్వేతైః - హయైః - యుక్తే - మహతి - స్యందనే - స్థితౌ

మాధవః - పాండవః - చ - ఏవ - దివ్యౌ - శంఖౌ - ప్రదధ్మతుః

తతః = తరువాత, శ్వేతైః = తెల్లని, హయైః - గుఱ్ఱములతో, యుక్తే = కూడిన, మహతి = ఉత్తమమైన, స్యందనే = రథమునందు, స్థితౌ= కూర్చొనియున్నట్టి, మాధవః = శ్రీకృష్ణ భగవానుడు, పాండవః = అర్జునుడు, చ = మరియు, ఏవ = కూడా, దివ్యౌ = దివ్యములగు, శంఖౌ = శంఖములను, ప్రదధ్మతుః = పూరించిరి.

పిమ్మట శ్వేతాశ్వములను పూన్చిన మహారథముపై ఆసీనులైయున్న శ్రీకృష్ణార్జునులు తమ దివ్యశంఖములను పూరించిరి.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

15 పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః।

పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః।

పాంచజన్యం - హృషీకేశః - దేవదత్తం - ధనంజయః

పౌండ్రం - దధ్మౌ - మహాశంఖం - భీమకర్మా - వృకోదరః

హృషీకేశః = శ్రీకృష్ణుడు, పాంచజన్యం = పాంచజన్యమను శంఖమును, ధనంజయః = ధనంజ యుడు, దేవదత్తం = దేవదత్తమను శంఖమును, భీమకర్మా = భయంకర కార్యము లాచరించు, వృకోదరః = భీముడు, పౌండ్రం = పౌండ్రమను, మహాశంఖం = గొప్ప శంఖమును, దధ్మౌ = పూరించిరి.

శ్రీకృష్ణుడు పాంచజన్యమును, అర్జునుడు దేవదత్త మును పూరించిరి. అరివీరభయంకరుడైన భీముడు పౌండ్రము అను గొప్పశంఖమును పూరించెను.

16 అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః।

నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ॥

అనంతవిజయం - రాజా - కుంతీ పుత్రః - యుధిష్ఠిరః

నకులః - సహదేవః - చ - సుఘోషమణిపుష్పకౌ

కుంతీపుత్రః = కుంతీపుత్రుడును, రాజా = రాజును అగు, యుధిష్ఠిరః = ధర్మరాజా, అనంత విజయం = అనంతవిజయ మనె శంఖమును, నకులః = నకులుడు, చ = మరియు, సహదేవః = సహ దేవుడును, సుఘోష మణిపుష్పకౌ=సుఘోషమణిపుష్పకము లనె శంఖములను

కుంతీపుత్రుడును, రాజును అగు ధర్మరాజా అనంత విజయము అను శంఖమును, నకులసహదేవులు సుఘోషమణిపుష్పకము లను శంఖములను పూరించిరి.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

17 కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః ।

ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥

కాశ్యః - చ - పరమేష్వాసః - శిఖండీ - చ - మహారథః

ధృష్టద్యుమ్నః - విరాటః - చ - సాత్యకిః - చ - అపరాజితః

పరమేష్వాసః = శ్రేష్ఠమైన విల్లుగల, కాశ్యః = కాశీరాజును, చ = మరియు, మహారథః = మహారథుడైన, శిఖండీ = శిఖండియు, చ = మరియు, ధృష్టద్యుమ్నః = ధృష్టద్యుమ్నుడును, విరాటః = విరాటుడును, చ = అలాగుననే, అపరాజితః = పరాజయ మెరుగని, సాత్యకిః = సాత్యకియును, చ = మరియు

ఓ రాజా! మహాధనుర్ధారియైన కాశీరాజా, మహారథుడైన శిఖండి యు, ధృష్టద్యుమ్నుడును, విరాటరాజా, పరాజయమెరుగని సాత్యకి యు మరియును,

18 ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।

సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ।

ద్రుపదః - ద్రౌపదేయాః - చ - సర్వశః - పృథివీపతే

సౌభద్రః - చ - మహాబాహు - శంఖాన్ - దధ్ముః - పృథక్ - పృథక్

పృథివీపతే = హే ధృతరాష్ట్ర మహారాజా, ద్రుపదః = ద్రుపదరాజు, చ = మరియు, ద్రౌపదేయాః = ద్రౌపదీపుత్రులును, చ = మరియు, మహాబాహుః = గొప్ప భుజములుగల, సౌభద్రః = సుభద్రా తనయుడగు అభిమన్యుడును, సర్వశః = అంతటను, పృథక్ పృథక్ = వేరువేరుగా , శంఖాన్ = శంఖములను, దధ్ముః = పూరించిరి.

ద్రుపదమహారాజు, ద్రౌపదియొక్క ఐదుగురు పుత్రులును, భుజబలశాలియు సుభద్రాపుత్రుడును అగు అభిమన్యుడును తమ తమ శంఖములను వేర్వేరుగా పూరించిరి.

19 స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।

నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥

సః - ఘోషః - ధార్తరాష్ట్రాణాం - హృదయాని - వ్యదారయత్

నభః - చ - పృథివీం - చ - ఏవ - తుములః వ్యనునాదయన్

తుములః - భయంకరమైన, సః = ఆ, ఘోషః = శబ్దము, నభః = ఆకాశమును, చ = మరియు, పృథివీం = భూమియును, చ = మరియు, ఏవ = కూడా, వ్యనునాదయన్ = ప్రతిధ్వనించుచు, ధార్తరాష్ట్రాణాం = ధృతరాష్ట్ర పుత్రులయొక్క, హృదయాని = గుండెలను, వ్యదారయత్ = భేదించెను.

పాండవవీరుల శంఖనాదములకు భూమ్యాకాశముల దద్దరిల్లినవి. ఆ శంఖారావములకు ధార్తరాష్ట్రుల హృదయములు తల్లడిల్లెను.

20 అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।

ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ।

హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే ।

అథ - వ్యవస్థితాన్ - దృష్ట్వా - ధార్తరాష్ట్రాన్ - కపిధ్వజః

ప్రవృత్తే - శస్త్రసంపాతే - ధనుః - ఉద్యమ్య - పాండవః

హృషీకేశం - తదా - వాక్యం - ఇదం - ఆహ - మహీపతే

అథ = తరువాత, మహీపతే = ఓ రాజా,చ శస్త్రసంపాతే = ఆయుధ ప్రయోగము, ప్రవృత్తే = జరుగబోవుచుండగా, కపిధ్వజః = కపిరాజు చిహ్నముతోడి పతాకముగల, పాండవః = అర్జునుడు, వ్యవస్థితాన్ = సమర సన్నద్ధులై యున్న, ధార్తరాష్ట్రాన్ = దుర్యోధనాదులను, దృష్ట్వా = చూచి, ధనుః = వింటిని, ఉద్యమ్య = సంధించి, తదా = అప్పుడు, హృషీకేశం= శ్రీకృష్ణునితో, ఇదం = ఈ , వాక్యం = వచనమును, ఆహ = పలికెను.

ఓ ధృతరాష్ట్ర మహారాజా ! యుద్ధమునకై సన్నద్ధులైయున్న ధార్తరాష్ట్రులను చూచి, కపిధ్వజుడైన అర్జునుడు ధనుస్సును పైకెత్తి శ్రీకృష్ణునితో ఇట్లనెను.

అర్జున ఉవాచ

21 సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ।

సేనయోః = ఉభయోః - మధ్యే - రథం - స్థాపయ - మే - అచ్యుత

అచ్యుత = శ్రీకృష్ణా, ఉభయోః = రెండింటీ, సేనయోః = సేనల యొక్క, మధ్యే = నడుమ, మే - నా యొక్క, రథం = రథమును, స్థాపయ = నిలుపుము.

ఓ అచ్యుతా! నా రథమును ఇరుసేనలమధ్య నిలుపుము.

22 యావదేతాన్నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్।

కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే।

కైః -మయా - సహ- యోద్ధవ్యం - అస్మిన్ - రణసముద్యమే

అస్మిన్ = ఈ, రణసముద్యమే = సమర సందర్భమున, మయా = నా చేత, కైః - సహ = ఎవరితో, యోద్ధవ్యం = యుద్ధము చేయబడవలయునో, యోద్ధుకామాన్ = సమరము నభిలషించి, అవస్థితాన్ = ఉన్న, ఏతాన్ = ఈ శూరులను, అహం = నేను, యావత్ నిరీక్షే = చూచెదను

ఈ సమరమునందు యుద్ధాభిలాషులై నిలిచియున్న ప్రతిపక్షయోధు లందరిని చూచి వారిలో ఎవరితో నేను యుద్ధము చేయవలసియున్నదో పరిశీలించెదను.

23 యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః।

ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః।

యోత్స్యమానాన్ - అవేక్షే - అహం - యే - ఏతే - అత్ర-సమాగతాః

ధార్తరాష్ట్రస్య - దుర్బుద్ధేః - యుద్ధే - ప్రియచికీర్షవః

దుర్బుద్ధేః = దుష్టబుద్ధియైన, ధార్తరాష్ట్రస్య = దుర్యోధనునకు, యుద్ధే = యుద్ధమునందు, ప్రియ చికీర్షవః = మేలు కోరినవారై, యే = ఏ, ఏతే = ఈ వీరులు, అత్ర = ఈ యుద్ధభూమియందు, సమాగతాః = వచ్చి యుండిరో, యోత్స్యమానాన్ = అలా యుద్ధము చేయువారిని, అహం = నేను, అవేక్షే = చూచెదను.

దుర్బుద్ధియైన దుర్యోధనునకు మేలుకోరి యుద్ధమున పాల్గొనదలచి వచ్చియున్న రాజులను అందరిని వీక్షించెదను.

సంజయ ఉవాచ

24. ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత।

సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్।

ఏవమ్ - ఉక్తః - హృషీకేశః -గుడాకేశేన - భారత

సేనయోః - ఉభయోః - మధ్యే - స్థాపయిత్వా - రథోత్తమమ్

భారత = ఓ ధృతరాష్ట్రుడా, ఏవం = ఈ విధముగ, గుడాకేశేన - అర్జునుని చేత, ఉక్తః = చెప్పబడిన, హృషీకేశః = శ్రీకృష్ణుడు, ఉభయోః = రెండు, సేనయోః = సైన్యముల యొక్క, మధ్యే = నడుమ, రథోత్తమం = గొప్పదియగు రథమును, స్థాపయిత్వా = నిలిపి

సంజయుడు పలికెను - ఓ ధృతరాష్ట్రా ! అర్జునుని కోరికమేరకు శ్రీకృష్ణుడు ఆ దివ్యరథమును నిలిపెను.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

25. భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।

ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ।

భీష్మద్రోణ ప్రముఖతః - సర్వేషాం - చ - మహీక్షితాం

ఉవాచ - పార్థ - పశ్య - ఏతాన్ - సమవేతాన్ - కురూన్ - ఇతి

భీష్మద్రోణ ప్రముఖతః = భీష్మద్రోణుల ఎదుట, చ = మరియు, సర్వేషాం = సర్వులైన, మహీక్షితాం = రాజుల ఎదుట (నిలిపి), పార్థ = ఓ అర్జునా, సమవేతాన్ = సన్నద్ధులై యున్న, ఏతాన్ = ఈ, కురూన్ = కౌరవులను, పశ్య = చూడుము, ఇతి = అని, ఉవాచ = పలికెను.

భీష్మద్రోణులకును, ఆ పక్షమునందలి మహారాజులందరికిని ఎదురుగా ఉభయసేనలమధ్య నిలిపి పిదప అతడు అర్జునునితో పార్థా! ఇక్కడ సమావేశమైన ఈ కౌరవ వీరులందరిని బాగుగా పరికింపుము అని నుడివెను.

26 తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।

ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ।

శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।

తత్ర - అపశ్యత్ - స్థితాన్ - పార్థః - పితౄన్ - అథ - పితామహాన్

ఆచార్యాన్ - మాతులాన్ - భ్రాతౄన్ - పుత్రాన్ - పౌత్రాన్ - సఖీన్ - తథా

శ్వశురాన్ - సుహృదః - చ - ఏవ - సేనయోః - ఉభయోః - అపి

అథ = తరువాత, పార్థః = అర్జునుడు, తత్ర = అక్కడ, ఉభయోః = రెండైన, సేనయోః = సేనలయందు, అపి = కూడా, స్థితాన్ = ఉన్నట్టి, పితౄన్ = తండ్రులను, పితామహాన్ = తాతలను, ఆచార్యాన్ = గురువులను, మాతులాన్ = మేనమామలను, భ్రాతౄన్ =సోదరులను, పుత్రాన్ = కుమారులను, పౌత్రాన్ = మనుమలను, సఖీన్ = మిత్రులను, తథా = మరియు, శ్వశురాన్ = మామలను, సుహృదః = సుహృదులను, చ = మరియు, ఏవ = కూడా, అపశ్యత్ = గాంచెను.

పిమ్మట అర్జునుడు యిరు సేనలయందును ఉన్న పెదతండ్రులను, పినతండ్రులను, తాతముత్తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, మిత్రులను, హితులను, మామలను మున్నగు ఆత్మీయులను చూచెను.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

27 తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్।

కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్।

తాన్ - సమీక్ష్య - సః - కౌంతేయః - సర్వాన్ - బంధూన్ - అవస్థితాన్

కృపయా- పరయా- ఆవిష్టః - విషీదన్ - ఇదం - అబ్రవీత్

సః = ఆ, కౌంతేయః = అర్జునుడు, అవస్థితాన్ = సన్నద్ధులై యున్న, తాన్= ఆ, సర్వాన్ = సమస్తమైన, బంధూన్ = బంధువులను, సమీక్ష్య = చూచి, పరయా = అత్యంత, కృపయా = కరుణతో, ఆవిష్టః=కూడుకొన్నవాడై, విషీదన్ = శోకించుచు, ఇదం = ఈ విధముగ, అబ్రవీత్ =పలికెను.

కుంతీపుత్రుడైన అర్జునుడు యుద్ధసన్నద్ధులై వచ్చియున్న బంధు వులను అందరిని చూచి, అత్యంత కరుణా సముచితుడై దుఃఖించుచు ఇట్లు పలికెను.

అర్జున ఉవాచ

28 దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్

29 సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి।

వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే।

దృష్ట్వ - ఇమం - స్వజనం - కృష్ణ- యుయుత్సుం - సముపస్థితం

సీదంతి-మమ-గాత్రాణి -ముఖం-చ-పరిశుష్యతి

వేపథుః-చ-శరీరే - మే - రోమహర్షః - చ - జాయతే

కృష్ణ= ఓ కృష్ణా, యుయుత్సుం = యుద్ధము చేయగోరి, సముపస్థితం = కూడియున్న, ఇమం = ఈ , స్వజనం = బంధుజనములను, దృష్ట్వ=గాంచి, మమ=నాయొక్క, గాత్రాణి=అంగములు, సీదంతి = శిథిలములై పోవుచున్నవి, చ=మరియు, ముఖం = నోరు, పరిశుష్యతి= ఎండి పోవుచున్నది, చ = మరియు, మే =నాయొక్క, శరీరే= దేహమునందు, వేపథుః = కంపనము, చ = మరియు, రోమహర్షః = గగుర్పాటు, జాయతే = కలుగుచున్నది.

అర్జునుడు పలికెను - ఓ కృష్ణా ! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజనసమూహమును జూచి, నా అవయవములు పట్టుతప్పుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి. ఒడలుపులకరించుచున్నది.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

అర్జున ఉవాచ

28 దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్

29 సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।

వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ।

దృష్ట్వా - ఇమం - స్వజనం - కృష్ణ- యుయుత్సుం - సముపస్థితం

సీదంతి-మమ-గాత్రాణి -ముఖం-చ-పరిశుష్యతి

వేపథుః-చ-శరీరే - మే - రోమహర్షః - చ - జాయతే

కృష్ణ= ఓ కృష్ణా, యుయుత్సుం = యుద్ధము చేయగోరి, సముపస్థితం = కూడియున్న, ఇమం = ఈ , స్వజనం = బంధుజనములను, దృష్ట్వా=గాంచి, మమ=నాయొక్క, గాత్రాణి=అంగములు, సీదంతి = శిథిలములై పోవుచున్నవి, చ=మరియు, ముఖం = నోరు, పరిశుష్యతి= ఎండి పోవుచున్నది, చ = మరియు, మే =నాయొక్క, శరీరే= దేహమునందు, వేపథుః = కంపనము, చ = మరియు, రోమహర్షః = గగుర్పాటు, జాయతే = కలుగుచున్నది.

అర్జునుడు పలికెను - ఓ కృష్ణా ! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజనసమూహమును జూచి, నా అవయవములు పట్టుతప్పుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి.

30 గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।

న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥

గాండీవం - స్రసంతే - హస్తాత్ - త్వక్ -చ - ఏవ - పరిదహ్యతే

న - చ - శక్నోమి-అవస్థాతుం - భ్రమతి- ఇవ - చ-మే-మనః

హస్తాత్= చేతినుండి, గాండీవం = గాండీవము, స్రంసతే = జారిపోవుచున్నది, చ = మరియు, త్వక్ = చర్మము, ఏవ = కూడా, పరిదహ్యతే = మండిపోవుచున్నది, చ = మరియు, అవస్థాతుం = నిలుచుటకు, న శక్నోమి = శక్తి లేక యున్నాను, చ = మరియు, మే = నా యొక్క, మనః = మనస్సు, భ్రమతీవ = భ్రమించుచున్నట్లున్నది.

గాండీవము చేతినుండి జారిపోవుచున్నది. చర్మము తపించిపోవుచున్నది. ఇక్కడ నిలబడుటకైనను శక్తిలేకున్నది. మనస్సు భ్రమించుచున్నట్లున్నది

31 నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।

న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ।

నిమిత్తాని - చ - పశ్యామి - విపరీతాని - కేశవ

న -చ - శ్రేయః - అనుపశ్యామి - హత్వా - స్వజనం - ఆహవే

కేశవ=కృష్ణా, చ = ఇంకను, విపరీతాని = విపరీతములైన, నిమిత్తాని = శకునములను, పశ్యామి = చూచుచున్నాను, ఆహవే = యుద్ధమునందు, స్వజనం = బంధువులను, హత్వా = వధించి, అను = అటుతర్వాత, శ్రేయః = శ్రేయమును, న చ పశ్యామి = చూడలేకపోతున్నాను.

ఓ కేశవా ! పెక్కు అపశకునములు కనబడుచున్నవి. యుద్ధమున స్వజనసమూహమును చంపుటచే , నేను పొందు శుభమేమిటో తెలియలేకున్నాను.

Email : care@srichalapathirao.com Ph : +91 9886265225 / +91 8008539770

32 న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।

కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా ।

న-కాంక్షే-విజయం-కృష్ణ-న-చ-రాజ్యం-సుఖాని-చ

కిం-నః-రాజ్యేన-గోవింద-కిం-భోగైః-జీవితేన-వా

కృష్ణ= హే కృష్ణా, విజయం = విజయమును, కాంక్షే = కోరుట, న = లేదు, చ = మరియు, రాజ్యం = రాజ్యమును, చ = మరియు, సుఖాని=సుఖములను, న = లేదు, గోవింద = హే గోవిందా, నః = మాకు, రాజ్యేన = రాజ్యముతో, కిం = ఏమి లాభము, భోగైః = భోగములచేత గాని, జీవితేన వా = బ్రతుకుటచేత గాని, కిం = ఏమి లాభము ?

ఓ కృష్ణా ! నేను విజయము గాని, రాజ్యము గాని, సుఖములు గాని కోరుకోవటంలేదు. గోవిందా ! ఈ రాజ్యమువలనగాని, ఈ భోగములవలన గాని, ఈ జీవితమువలన గాని ఏమి ప్రయోజనము ?

33 యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।

త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ

యేషాం-అర్థే - కాంక్షితం - నః - రాజ్యం-భోగాః - సుఖాని-చ

తే- ఇమే-అవస్థితాః-యుద్ధే - ప్రాణాన్-త్యక్త్వా-ధనాని-చ

యేషాం అర్థే = ఎవరికొరకు, నః =మావలన, రాజ్యం = రాజ్యము, భోగాః = భోగములు, చ=మరియు, సుఖాని=సౌఖ్యములు, కాంక్షితం = కోరబడినవో, తే=అట్టి, ఇమే=వీరు, యుద్ధే = యుద్ధమునందు, ప్రాణాన్ = ప్రాణములను, చ = ఇంకను, ధనాని = ధనములను, త్యక్త్వా=విడిచి, అవస్థితాః=నిలిచియున్నారు.

మనము ఎవరికై ఈ రాజ్యమును, భోగములను, సుఖములను కోరుకొనుచున్నామో, వారే ధనప్రాణముల యెడ ఆశలు వదులుకొని యుద్ధమునకు వచ్చినిలిచియున్నారు.

34 ఆచార్యాః పితరః పుత్రాః తథైవ చ పితామహాః।

మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధిన స్తథా।

ఆచార్యాః-పితరః - పుత్రాః-తథా- ఏవ-చ-పితామహాః

మాతులాః-శ్వశురాః -పౌత్రాః - శ్యాలాః-సంబంధినః - తథా

ఆచార్యాః = గురువులు, పితరః = తండ్రులు, పుత్రాః=కుమారులు, తథా ఏవ చ =అలాగు నసే, పితామహాః = తాతలు, మాతులాః = మేనమామలు, శ్వశురాః=మామలు, పౌత్రాః = మనుమలు, శ్యాలాః=బావలు, తథా=అలాగుననే, సంబంధినః = చుట్టములు.

గురువులు, తండ్రులు, తాతలు, కొడుకులు, మనుమలు, మేనమామలు, మామలు, బావమఱదులు, ఇతర బంధువులు మొదలగువారు అందరును ఇచ్చటికి వచ్చియున్నారు. (34)

35 ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతో೭పి మధుసూదన।

అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే।

ఏతాన్-హన్తుం - ఇచ్ఛామి - ఘ్నతః - అపి -మధుసూదన

అపి - త్రైలోక్యరాజ్యస్య-హేతోః-కిం-ను-మహీకృతే

ఏతాన్ = వీరిని, ఘ్నతః అపి = చంపుచున్నవారైనను, హంతుం = వధించుటకు, త్రైలోక్య రాజ్యస్య = త్రిలోకాధిపత్యము, హేతోః అపి = కొరకుగాని, ఇచ్ఛామి = కోరుట, న = లేదు, మధుసూదనః హే మధుసూదనా, మహీకృతే = భూమి కొరకు, ను కిమ్ = ఎలా కోరను ?

ఓ మధుసూదనా ! ముల్లోకాధిపత్యముకొరకైనను నేను ఎవ్వరినీ చంప ఇచ్ఛగింపను. ఇక ఈ భూమండలవిషయమై చెప్పనేల ? అట్లే వీరిలో ఎవ్వరైనను నన్ను చంపబూనిననూ నేను మాత్రము వీరిని చంపలేను.

36 నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన।

పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః।

నిహత్య-ధార్తరాష్ట్రాన్-నః -కా-ప్రీతిః-స్యాత్-జనార్దన

పాపం - ఏవ - ఆశ్రయేత్-అస్మాన్ - హత్వా - ఏతాన్- ఆతతాయినః

జనార్దనః=హే జనార్ధనా!, ధార్తరాష్ట్రాన్ = దుర్యోధనాదులను, నిహత్య=చంపి, నః = మాకు, కా = ఏమి, ప్రీతిః = సంతోషము, స్యాత్ = కలుగును, ఆతతాయినః = దురాత్ములైన, ఏతాన్ = వీరిని, హత్వా = చంపి, అస్మాన్ = మమ్ములను, పాపమేవ = పాపమే, ఆశ్రయేత్ = కలుగును.

ఓ జనార్దనా ! ఈ దుర్యోధనాదులను చంపి, మనము బావుకొనునది ఏమి? (మనము మూట కట్టుకొనునది యేమి ?) దుర్మార్గులైన వీరిని చంపుటవలన మనకు పాపమే కలుగును.

37 తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్।

స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ।

తస్మాత్ -న-అర్హాః-వయం-హంతుం-ధార్తరాష్ట్రాన్-స్వబాంధవాన్

స్వజనం - హి-కథం-హత్వా-సుఖినః స్యామ - మాధవ

మాధవః=కృష్ణ, తస్మాత్=అందువలన, వయం = మేము, స్వబాంధవాన్= బంధువులతో గూడిన, ధార్తరాష్ట్రాన్ = దుర్యోధనాదులను, హంతుం=చంపుటకు, అర్హాః=అర్హులము, న = కాము, స్వజనం = స్వజనులను, హత్వా = చంపి, కథం = ఏవిధముగా, సుఖినః = సుఖ వంతులము, స్యామ హి = కాగలము

కనుక ఓ మాధవా ! మనబంధువులైన ఈ ధార్తరాష్ట్రులను చంపుటకు మేము అర్హులముకాము. స్వజనులను చంపి మేము ఎలా సుఖపడగలము?

38 యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః।

కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్।

యద్యపి - ఏతే-న-పశ్యంతి-లోభోపహత చేతసః

కులక్షయకృతం - దోషం - మిత్రద్రోహే - చ-పాతకం

లోభోపహత చేతసః = లోభముచేత చెదరగొట్టబడిన మనస్సుగల, ఏతే = వీరు, కులక్షయ కృతం = కులనాశము వలన కలుగు, దోషం = చెడును, చ=మరియు, మిత్రద్రోహే = మిత్రద్రోహము వలన కలుగు, పాతకం = పాపమును, పశ్యంతి =చూచుట, యద్యపిన = లేకపోయినను.

లోభకారణముగ భ్రష్టచిత్తులైన వీరు కులక్షయము వలన కలుగు దోషములను, మిత్రద్రోహమువలన సంభవించు పాపములను చూడకున్నచో,

39 కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్।

కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్ధన।

కథం-న-జ్ఞేయం-అస్మాభిః - పాపాత్-అస్మాత్-నివర్తితుం

కులక్షయకృతం - దోషం-ప్రపశ్యద్భిః-జనార్ధన

జనార్ధన=హే జనార్ధనా, కులక్షయకృతం = కులనాశము వలన కలుగు, దోషం = దోషమును, ప్రపశ్యద్భిః = చక్కగా గ్రహించిన, అస్మాభిః = మాచేత, అస్మాత్ = ఈ పాపాత్ = పాపము నుండి, నివర్తితుం = తొలగుటకు, కథం = ఎటుల, జ్ఞేయం = తెలియదగినది, న = కాదు.

జనార్ధనా! కులనాశనమువలన కలుగు నష్టములను ఎరింగిన మనము ఈ పాపములకు దూరముగా ఉండుటకు ఏల ప్రయత్నించకూడదు ?

40 కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।

ధర్మే నష్టేకులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత ।

కులక్షయే - ప్రణశ్యంతి - కులధర్మాః - సనాతనాః

ధర్మే - నష్టే- కులం - కృత్స్నం - అధర్మః - అభిభవతి- ఉత

కులక్షయే = కులనాశము జరుగునపుడు, సనాతనాః = అనాదిగాయున్న, కులధర్మాః = కులధర్మములు, ప్రణశ్యంతి = సంపూర్ణముగా నశించునున, ధర్మే = ధర్మము, నష్టే= నశింపగా, కృత్స్నం = సకలమైన, కులం = కులమును, అధర్మః = అనాచారము, అభిభవేతి ఉత = వ్యాపించునుకదా.

కులక్షయమువలన సనాతనములైన కులధర్మములన్నియును నశించును. ధర్మము అంతరించి పోయినప్పుడు కులము నందు అంతటను పాపమే వ్యాపించును.

41 అధర్మాభిభవాత్ కృష్ణప్రదుష్యంతి కులస్త్రియ ః।

స్త్రీషు దుష్టాసు వార్ష్ణే య జాయతే వర్ణసంకరః।

అధర్మాభిభవాత్-కృష్ణ-ప్రదుష్యంతి - కులస్త్రియః

స్త్రీషు - దుష్టాసు వార్ష్ణే య -జాయతే - వర్ణసంకరః

కృష్ణ= ఓ కృష్ణా, అధర్మాభిభవాత్ = అధర్మము వృద్ధినొందుట వలన, కులస్త్రియః = కులాంగనలు, ప్రదుష్యంతి = చెడిపోవుదురు, వార్ష్ణే య=కృష్ణా, స్త్రీషు దుష్టాసు =స్త్రీలు చెడిపోవుటవలన, వర్ణసంకరః = వర్ణసంకరము, జాయతే = కలుగుచున్నది.

ఓ కృష్ణా ! అధర్మము పెచ్చుపెరిగి పోయినప్పుడు కులస్త్రీలు మిక్కిలి చెడిపోవుదురు. స్త్రీలు చెడినచో వర్ణసాంకర్యము కలుగును.

42 సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ।

పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః।

సంకరః - నరకాయ - ఏవ -కులఘ్నానాం - కులస్య - చ

పతంతి - పితరః - హి - ఏషాం - లుప్త పిండోదకక్రియాః

సంకరః=వర్ణసంకరము, కులఘ్నానాం = కులమును చెడిపిన వారలకును, చ = మరియు, కులస్య = కులమునకు, నరకాయ ఏవ = నరకము కొరకే, ఏషాం = వీరియొక్క, పితరః = పితరులు, లుప్తపిండోదక క్రియాః = శ్రాద్ధతర్పణ క్రియలులేనివారై, పతంతిహి = పతనము గు చున్నారు.

వర్ణసాంకర్యము కులఘాతకులను, నరకము నందు పడవేయును. పిండోదకములు (శ్రాద్ధతర్పణములు) లోపించినందువలన వారిపితరులును పతనముగుదురు.

43 దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః।

ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః।

దోషైః - ఏతైః - కులఘ్నానాం - వర్ణసంకర కారకైః

ఉత్సాద్యంతే - జాతి ధర్మాః - కులధర్మాః చ - శాశ్వతాః

ఏతైః = ఈ , వర్ణసంకర కారకైః = వర్ణ సంకరమునకు కారణమైన, దోషైః= దోషములచేత, కులఘ్నానాం = వర్ణసంకరమొనర్చిన వారి యొక్క, శాశ్వతాః = శాశ్వతములైన, జాతిధర్మాః = జాతి ధర్మములు, చ = మరియు, కులధర్మాః = కులధర్మములు, ఉత్సాద్యంతే=నశించు చున్నవి.

వర్ణసాంకర్యమునకు మూలములైన ఈ దోషమువలన కులఘాతకులయొక్క సనాతన కులధర్మములు, జాతిధర్మములు నశించుచున్నవి.

44 ఉత్పన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన।

నరకేఽనియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ।

ఉత్పన్న కులధర్మాణాం - మనుష్యాణాం - జనార్దన

నరకే - అనియతం-వాసః-భవతి- ఇతి-అనుశుశ్రుమ

జనార్దన = జనార్దనా, ఉత్పన్నకులధర్మాణాం = చెడిన కులాచారములుగల, మనుష్యాణాం = మనుజులకు, నరకే = నరకమునందు, అనియతం = అనంతకాలము, వాసః = నివాసము, భవతి = కలుగుచున్నది, ఇతి = అని, అనుశుశ్రుమ= ఆలకించుచున్నాము.

ఓ జనార్ధనా ! కులధర్మములు నశించినవారికి శాశ్వతముగా నరకప్రాప్తి తప్పదని వినుచున్నాము.

45 అహో బత మహత్ పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।

యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః ।

అహో-బత-మహాత్పాపం - కర్తుం - వ్యవసితాః - వయం

యత్-రాజ్యసుఖలోభేన-హంతుం స్వజనం - ఉద్యతాః

యత్ = ఏ కారణమువలన, రాజ్యసుఖలోభేన = రాజ్యసుఖమునందలి లోభముచేత, స్వజనం = బంధువులను, హంతుం = చంపుటకు, ఉద్యతాః = ఉద్యమించితిమో, మహత్ = గొప్పదైన, పాపం = పాపమును, కర్తుం = చేయుటకు, వయం = మేము, వ్యవసితాః = సమకట్టితిమి, అహోబత = అయ్యో! ఎంతశోకము ?

రాజ్యసుఖ లోభముచేమనము బుద్ధిమంతులమైయుండియు స్వజనులను చంపుటకు ఉద్యుక్తులమై, ఈ ఘోరపాపకృత్యములను చేయుటకు సమకట్టితిమి గదా! అక్కటా!

46 యది మామప్రతీకారమ్ అశస్త్రం శస్త్రపాణయః।

ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్।

యది-మాం-అప్రతీకారం -అశస్త్రం-శస్త్రపాణయః

ధార్తరాష్ట్రా - రణే-హన్యుః-తత్-మే-క్షేమతరం-భవేత్

అప్రతీకారం = ప్రతీకారముచేయని, అశస్త్రం = శస్త్రరహితమైన, మాం = నన్ను, శస్త్ర పాణయః = శస్త్రధారులైన, ధార్తరాష్ట్రాః = దుర్యోధనాదులు, రణస్త =యుద్ధమునందు, హన్యుః యది = చంపుదురేని, తత్ = అది, మే=నాకు, క్షేమతరం = శ్రేయస్కరము , భవేత్ = అగును.

ఆయుధములు పట్టక ఎదిరింపని నన్ను శస్త్రములను చేబూని దుర్యోధనాదులు యుద్ధమున వధించినను, అది నాకు క్షేమకరమే యగును.

సంజయ ఉవాచ

47 ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్।

విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః।

ఏవం - ఉక్త్వా-అర్జునః-సంఖ్యే-రథోపస్థే - ఉపావిశత్

విసృజ్య-సశరం-చాపం-శోకసంవిగ్నమానసః

అర్జునః=అర్జునుడు, ఏవం= ఈ విధముగ, ఉక్త్వా=పలికి, శోకసంవిగ్న మానసః = దుఃఖము చేత చలించిన మనస్సు కలవాడై, సశరం = శరయుక్తమైన, చాపం = ధనుస్సును, విసృజ్య= విడిచి, సంఖ్యే = రణరంగమునందు, రథోపస్థే=రథముమీద, ఉపావిశత్ = కూర్చొనెను.

సంజయుడు పలికెను - అర్జునుడు ఈ విధముగా పలికి శోకముచే కలతచెందిన మనస్సుకలవాడై, యుద్ధభూమియందు ధనుర్బాణములను విడిచి, రథము వెనుకభాగమున చతికిలబడెను.

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు

బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే

అర్జునవిషాదయోగోనామ ప్రథమోఽధ్యాయః